

నియోజకవర్గ ఇన్చార్జి అన్నా ను మర్యాద పూర్వకంగా కలసిన వైస్ ఎంపీపీ కుందురు


RK అగ్ని న్యూస్

The Power Of Truth

9441533080 - 8309890844

మే : 21 బుధవారం సంపుటి : 29 సంచిక : 115


## కార్యకర్తల కృషి ఫలితమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ విజయం





### - మినీ మహానాడు లో ఎమ్మెల్యే ముత్తుముల

అగ్ని న్యూస్,గిద్దలూరు (మే 20): కార్యకర్తల కృషి ఫలితమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ విజయమని, కార్యకర్తే టీడీపీకి అధినేతని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని విట్టా సుబ్బరత్నం కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో మినీ మహానాడు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అండతో పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. అధికారంలో ఉన్న లేకపోయినా కార్యకర్తలకు సీఎం చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ అండగా ఉన్నారని, గతంలో పార్టీ సభ్యత్వం

## ప్రకాశం పంతులు త్యాగాలు చిరస్మరణీయం



### – జిల్లా ఎస్పీ దామోదర్

అగ్ని న్యూస్,ఒంగోలు (మే 20): స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి గా పేరుగాంచిన స్వర్గీయ టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ, పోలీస్ అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు 1872 ఆగష్టు 23 న ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం వినోదరాయుని పాలెం గ్రామంలో సుబ్బమ్మ, గోపాల కృష్ణయ్య దంపతులకు జన్మించారన్నారు. చిన్నతనంలో కష్టపడి విద్యాబ్యాసం చేసి లండన్ లో బారిష్టర్ పాసై ప్రముఖ న్యాయవాదిగా సేవలందించారని, గొప్ప దేశ భక్తుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, మేధావి, ధీరుడు, కార్యదక్షుడని, మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో బ్రిటిష్ పోలీసుల తుపాకీతూటాలకు ఎదురుగా గుండె చూపిన ఆయన సాహసం ఎన్నటికీ మరువలేనిదని కొనియాడారు. ప్రత్యేకంగా రాష్ట్ర సాధనలో

## టీడీపీ పట్టణ అధ్యక్షులుగా పఠాన్ ఇబ్రహీం



అగ్నిన్యూస్,మార్కాపురం(మే20): పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా పటాన్ ఇబ్రహీం ఖాన్ ఎంపికయ్యారు. మార్కాపురం పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా పఠాన్ ఇబ్రహీం ఖాన్ ను సోమవారం నిర్వహించిన మినీ మహానాడులో పట్టణ అధ్యక్షుడు ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి అంకిత భావంతో పనిచేస్తానని,నాపై ఉన్న నమ్మకంతో పట్టణ అధ్యక్షునిగా బాధ్యతలు సంపూర్ణంగా నిర్వహిస్తానని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మా అన్న అయినటువంటి మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.






## మండల టీడీపీ అధ్యక్షునిగా కాకర్ల శ్రీనివాసులు యాదవ్



### - తెలుగుదేశం పార్టీలో బీసీలకు పెద్దపీట వేస్తున్న ఎమ్మెల్యే కందుల

అగ్ని న్యూస్,మార్కాపురం (మే 20): తెలుగుదేశం పార్టీలో బీసీలకు పెద్దపీట వేస్తున్నామని అందుకు మండల పార్టీ అధ్యక్షుడిగా కాకర్ల శ్రీనివాసులు యాదవ్ ఎంపిక నిదర్శనమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన కాకర్ల శ్రీనివాసులు గతంలో మొట్ట మొదటిసారిఎంపీటీసీగా ఎన్నికయ్యారు. అనంతరం ఆయన సతీమణి కాకర్ల రాజేశ్వరి వైస్ ఎంపీపీ గా కొనసాగారు. 2014లో సర్పంచ్ గా గెలుపొంది గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత రెండు సార్లు మండల టిడిపి అధ్యక్షులుగా పనిచేశారు. అనంతరం ఏఎంసి వైస్ చైర్మన్ గా,చైర్మన్ గా కొనసాగారు.నియోజవర్గం రైతు సంఘం అధ్యక్షులుగా పని చేశారు. ఇప్పుడు మూడోసారిమండల పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మండలంలో తనదైన ముద్ర వేసుకున్న కాకర్ల, ఎమ్మెల్యే కందుల కు ముఖ్య అనుచరుడిగా ఉంటూ మండలంలో ఉన్న బీసీలకు అండదండగా ఉంటూ ఏదైనా సమస్య వస్తే నేనున్నానంటూ భుజస్కందాలపై వేసుకొని బీసీ నేతగా పేరు పొందాడు.కాకర్ల ఎంపిక పట్లఎమ్మెల్యేకందుల ను, పలువురు బీసీలు, యాదవ సామాజిక వర్గం అభినందనలు తెలిపారు.

## నియోజకవర్గ ఇన్చార్జి అన్నా ను మర్యాద పూర్వకంగా కలసిన వైస్ ఎంపీపీ కుందురు

మొదటి పేజీ తరువాయి ...

అగ్ని న్యూస్,మార్కాపురం (మే 20): స్థానిక జవహర్ నగర్ కాలనిలో సోమవారం రోజున జరిగిన మార్కాపురం మండల ఉపాధ్యక్ష ఎన్నికలలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కుందురు మల్లారెడ్డి విజయం సాధించారు. ఈ సందర్భంగా గిద్దలూరు మాజి శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త అన్నా రాంబాబు ను మంగళవారం మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నిక ఏకగ్రీవం కావడం కోసం కృషి చేసిన అన్నా రాంబాబు ను దుశ్శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నారు బాపన్ రెడ్డి, ఎంపీపీ బండి లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ పోరెడ్డి అరుణా చెంచిరెడ్డి తదితరుల మండల నాయకులు పాల్గొన్నారు.

## కార్యకర్తల కృషి ఫలితమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ విజయం

మొదటి పేజీ తరువాయి ...

తీసుకున్న వారికి ప్రమాద భీమా ద్వారా రూ. 2 లక్షలు అందిస్తే, ప్రస్తుతం రూ. 5 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. ఇటీవల నియోజకవర్గలో రోడ్డు ప్రమాదంలో మరణించిన కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 5 లక్షలు పరిహారం అందించడం జరిగిందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు రాజ్యాధికారం ఇచ్చిన ఘనత స్వర్గీయ ఎన్టీఆర్ కే దక్కుతుందన్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత రాష్ట్రానికి పెద్ద దిక్కుల సీఎం చంద్రబాబు 2014లో నిలబడ్డారని రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న తరుణంలో ప్రస్తుత మాజీ సీఎం జగన్ మోసపూరితమైన హామీలు ఇచ్చి 2019లో అధికారంలోకి వచ్చారన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇష్టానుసారంగా వ్యవహరించారాని రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి దివాలా తీసేలా చేశారన్నారు. తిరిగి రాష్ట్రాన్ని చంద్రబాబు బాగు చేస్తున్నారని అన్నారు. అన్ని వర్గాల వారిని ఆదుకుంటూ ఇచ్చిన హామీలన్నిటిని నిలబెట్టుకుంటూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. ఈనెల 27, 28, 29 తేదీలలో కడపలో జరిగే మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, జడ్పీటీసీ సభ్యులు, మార్కెట్ యార్డ్, నగర పంచాయతీ, సొసైటీ బ్యాంకు చైర్మన్లు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, ప్రధాన కార్యదర్శులు, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రకాశం పంతులు త్యాగాలు చిరస్మరణీయం

మొదటి పేజీ తరువాయి ...

నిర్ణాయక పాత్ర పోషించారని, 1953 అక్టోబర్ 1 న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రిగా ప్రజా సేవకులు అయ్యారని,ప్రజల కోసం ఆయన చేసిన త్యాగాలు సేవలు ఎప్పటికీ ఆదర్శప్రాయమన్నారు. తెలుగు జాతికి చేసిన సేవలకు గుర్తుగా 1972 డిసెంబర్ 5 న ఒంగోలు జిల్లా పేరును ప్రకాశం జిల్లాగా మార్చారని, ప్రకాశం పంతులు తెలుగువారి తెగువ కు, నిబద్ధత, ధైర్యం, సమైక్యతకు నిలువెత్తు నిదర్శనమని, అలాంటి మహనీయుని జీవితాన్ని, ధైర్యసాహసాలు, పోరాట పటిమను నేటి, భావితరాలు ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, సి సి ఎస్ ఇన్స్పెక్టర్ జగదీష్, ఆర్ఐ రమణ రెడ్డి, ఏఆర్ ఎస్సైలు ప్రసాద్, పాపిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.




# మల్లికార్జునను పరామర్శించిన తెదేపా నాయకులు



అగ్ని న్యూస్,యర్రగొండపాలెం(మే 20): పట్టణంలోని టీడీపీ బీసీ సీనియర్ నాయకులు ముత్తలూరి మల్లికార్జున ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న యర్రగొండపాలెం మండల టీడీపీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, టీడీపీ నాయకులు వారిని మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంచర్ల సత్యనారాయణ గౌడ్, మంత్రు నాయక్ ,పట్టణ టీడీపీ అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి (మ్యాక్స్), చిట్యాల వెంగళ్ రెడ్డి, రెంటపల్లి సుబ్బారెడ్డి, సూర్యనారాయణ, షేక్ వలి, కిషోర్ వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కిషోర బాలికలకు అవగాహన సదస్సు



అగ్నిన్యూస్,తర్లుపాడు(మే20): మండలంలోని చెన్నారెడ్డి పల్లి గ్రామం లో కిషోరి వికాసం 2.0 కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్ వైజర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ కృష్ణవేణి మాట్లాడుతూ కిశోరి వికాసం కార్యక్రమం అనేది బాలికల అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన ఒక ప్రత్యేక కార్యక్రమమని, దీని ద్వారా బాలికలకు విద్య, నైపుణ్యం, ఎదుగుదల, పోటీతత్వం, వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాల గురించి అవగాహన కల్పించటం జరుగుతుంది అని,బాలికలకు విద్య, న్యూట్రిషన్, ఆరోగ్యం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, యోగా, ఫిట్ నెస్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వటం జరిగిందని బాలికలకు బాల్య వివాహాలు, అత్యాచారాలు, పోక్సో చట్టం, ఆత్మరక్షణ, వృత్తి విద్య వంటి అంశాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీకాంత్, మహిళా పోలీస్ మౌనిక, ఏయన్ యం నాగ స్రవంతి అంగన్వాడీ టీచర్స్, బాలికలు పాల్గొన్నారు.

అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy

## ఆపరేషన్ సింధూర్ కు సంఘీభావం గా భారీ బైక్ ర్యాలీ





– స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు

– జై సింధూర్ జై భారత్ నినాదాలతో మార్మోగిన గిద్దలూరు

అగ్ని న్యూస్,గిద్దలూరు (మే 20): ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం పై సంఘీభావం తెలుపుతూ స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా గాంధీ బొమ్మ సెంటర్ లో గాంధీ మహాత్ముడికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ ర్యాలీ కొనసాగించారు. ర్యాలీలో మాజీ ఆర్మీ ఉద్యోగులతో పాటు ఎన్డీఏ కూటమి కార్యకర్తలు ప్రజలు స్వచ్ఛందంగా భారీగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ పహల్గాం లో 26 మంది అమాయక టూరిస్టులను, ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్నారని మన దేశంతో పాటు కాశ్మీర్ అభివృద్ధి చెందుతుందని ఓర్వలేక పాకిస్తాన్ ప్రభుత్వం, ఉగ్రవాదులతో చేతులు కలిపి దాడులు చేయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి దాడులకు భారతదేశం భయపడదని ఆపరేషన్ సింధూర్ పేరిట కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులను ఎరివేసి పాకిస్తాన్ కు గుణపాఠం చెప్పిందని అన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావటానికి కృషి చేసిన త్రివిధ దళాలకు నా సెల్యూట్ అని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి అన్నారు. జై సింధూర్ జై భారత్ అని నినాదాలతో గిద్దలూరు పట్టణం మారుమోగింది. ఈ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా భారీగా పాల్గొన్నారు.

## తహసీల్దార్ కు విఆర్వోల వినతి



అగ్నిన్యూస్,పొదిలి(మే20) రాష్ట్ర ప్రభుత్వం రేషనలైజేషన్ క్లస్టర్ విధానంలో వీఆర్వోల క్యాడర్ ను తగ్గిస్తూ జారీ చేసిన జీవో నెంబర్ నాలుగును వ్యతిరేకిస్తూ స్థానిక విఆర్వోలు మంగళవారం స్థానిక తహసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విఆర్వోల సంఘం నాయకులు బాల వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సచివాలయాల రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా ఇచ్చిన జీవో నెంబర్ 4 వల్ల వి.ఆర్.ఓ.ల కేడర్ కు, ప్రమోషన్ల ఛానల్ కు, మిగులు సిబ్బందిగా వీఆర్వోలను నియమించుట గురించి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. మిగులు సిబ్బంది సమస్య కాకుండా ఉన్న విఆర్వోలు కూడా పని ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రేషనలైజేషన్ క్లస్టర్ విధానంలో జరుగుతున్న లోపాలను గ్రహించి పలు పర్యాయాలు రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లిన, రాష్ట్ర ఉన్నతాధికారులకు విన్నవించిన కానీ ప్రభుత్వం జీవో నెంబర్ నాలుగు విడుదల చేయడంతో మేము తీవ్ర ఆందోళనలో ఉన్నాము. రాష్ట్ర, జిల్లా సంఘం ఆదేశాల మేరకు తాహశిల్దార్ ఎం.వి. కృష్ణ రెడ్డికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలి




అగ్నిన్యూస్,మార్కాపురం(మే20): కార్మికులకు వ్యతిరేకమైన లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని, అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని,ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు వర్తింపచేయాలని స్థానిక పారిశ్రామిక వాడలోని హైవే పైసిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డి కెయం రఫీ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల కు లభించేందుకు కార్మిక వర్గం బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్స్ గా తీసుకురావటాన్ని వారు వ్యతిరేకించారు. కార్మిక వ్యతిరేక కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతన చట్టాన్ని, సమ్మె చేసే హక్కును, హరించే విధంగా, కార్మికులను యజమానులకు బానిసలుగా తయారు చేసే చర్యలు మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జాతి సంపద అయిన ప్రభుత్వ రంగ సంస్థలు బిఎస్ఎన్ఎల్, ఇన్సూరెన్స్, పోస్టల్, రైల్వే, స్టీల్ ప్లాంట్ సంస్థలను కార్పొరేటర్ సంస్థలకు కట్టబెట్టి, కార్మికులకు ఉపాధి దూరం చేసే చర్యలకు మోడీ ప్రభుత్వం చేస్తుందని ప్రభుత్వంగా సంస్థలను ప్రైవేటీకరణ మానుకోవాలని అన్నారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికుల చేతవెట్టి చాకిరి మానుకొని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ స్కీముల్లో పనిచేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వారికి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలలో కూడా అమలు చేయాలని,ఉపాధి హామీ పని రోజులు పెంచాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు డి సోమయ్య, సిఐటియు పట్టణ కార్యదర్శి పి రుబెన్, మండల నాయకులు జె. నాగరాజు, బాల శేషయ్య, వెంకటేశ్వర్ రెడ్డి, రాములు, ప్రకాశం, శార పాల్గొన్నారు.

## ప్రతి హిందువు హనుమాన్ శోభాయాత్ర లో పాల్గొనాలి




– విలేకరుల సమావేశంలో శోభాయాత్ర కమిటీ పిలుపు

అగ్ని న్యూస్,మార్కాపురం (మే 20): ప్రతి హిందువు హనుమాన్ శోభాయాత్ర విజయానికి తన వంతు కృషి చేయాలనీ శోభాయాత్ర కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ హనుమాన్ శోభాయాత్రను మే 22న మార్కాపురంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక తర్లుపాడు రోడ్డులో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద నుండి 22 వ తేదీ గురువారం సాయంత్రం 4 గంటలకు 20 అడుగుల హనుమాన్ విగ్రహంతో శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని, శోభాయాత్ర నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ శోభాయాత్ర లో స్థానిక ప్రజలు, హిందూ సోదర సోదరీమణులు పెద్ద ఎత్తున పాల్గొని సనాతన ధర్మాన్ని గౌరవించే విధంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపు నిచ్చారు. మన సంస్కృతి, సంప్రదాయాలను నిలబెట్టే సందర్భం ఇదేనని ఆంజనేయ స్వామి కృపకు పాత్రులు కావాలనుకుంటే తప్పక ఈ శోభాయాత్రలో పాల్గొనాలి అని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో గోపాలుని హరిహరరావు, ఇమ్మడిశెట్టి వీరారావు,గుంటక సుబ్బారెడ్డి, రంగస్వామి గౌడ్,పివి కృష్ణారావు,గుంటక వనజాక్షి, వాసు,అపర్ణ, లావణ్య, సుబ్రమణ్యం, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞానాభివృద్ధి ఆహ్లాదకర వాతావరణంలో కొనసాగాలి



## - జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు మండ్లా. శ్రీనివాసులు

అగ్ని న్యూస్,రాచర్ల(మే 20): విజ్ఞానాభివృద్ధి ఆహ్లాదకర వాతావరణంలో కొనసాగాలని జె.వి.వి జిల్లా అధ్యక్షులు మండ్ల. శ్రీనివాసులు తెలియజేశారు. రాచర్ల మండల కేంద్రములో ప్రకాశం బాలోత్సవం కార్యక్రమంలో భాగంగా జనవిజ్ఞాన వేదిక,యుటియఫ్ రాచర్ల మండల శాఖలు విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన,వినోదం కార్యక్రమం లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర నాయకులు పి. స్వరూపా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా, సామాజిక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలనీ, సహ పాఠ్య కార్యక్రమాల్లోనూ రాణించాలని తెలియజేశారు. విద్యార్థులు గణితం పట్ల భయం వీడాలని, గణితాన్ని ఎంతో సరదాగా నేర్చుకోవచ్చని జెవివి నాయకులు డి. వెంకటేశ్వర్లు కొన్ని ఉదాహరణల ద్వారా తెలియజేసారు. ఇక్కడ పిల్లల్ని అలరించే విధంగా చాలా అంశాలను చేసి చూపారు. ఈ కార్యక్రమంలో జెవివి రాచర్ల మండల ప్రధాన కార్యదర్శి పి. సుధీర్ కుమార్ రెడ్డి, పి. పరమేశ్వర రెడ్డి, యస్. మధుసూదన రెడ్డి, కోరె.కృష్ణ, డి. కాశిం, కె. బాబు, యస్.కె.ఎ. రజాక్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# నేటి యువతరానికి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శప్రాయులు


## - ఏ.కే.యూలో ప్రకాశం పంతులు కు ఘనంగా నివాళులు

అగ్ని న్యూస్,ఒంగోలు (మే 20): ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి, తెలుగుజాతి గర్వించ దగిన మహానేత స్వర్గీయ టంగుటూరి ప్రకాశం పంతులు 68 వ వర్ధంతి వేడుకలను మంగళవారం స్థానిక ఆంధ్ర కేసరి యూనివర్శిటీ నందు ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర కేసరి యూనివర్శిటీ పరిపాలనా భవనం వద్ద ఏర్పాటు చేసిన ప్రకాశం పంతులు నిలువెత్తు చిత్ర పటానికి ఆంధ్ర కేసరి యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి,హరిబాబు, యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. రాజ మోహన్ రావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్ నిర్మలామణి, సిడిసి డీన్ ప్రొఫెసర్ జి.సోమ శేఖర తదితరుల ఆద్వర్యంలో పూలమాలలు వేసి ఘనమైన  నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్ మూర్తి మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు బాల్యంలో ఎన్నో ఆర్థిక పరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ, మొక్కవోని ధైర్యం, పట్టుదల, ఆత్మ విశ్వాసంతో వాటన్నింటినీ అధిగమించి లక్ష్య సాధనయే పరమావధిగా భావించి, ఉన్నతమైన చదువులు చదివి తెలుగుజాతి గర్వించ దగిన మహనీయులుగా ప్రజల హృదయాలలో శాశ్వతమైన స్థానాన్ని సంపాదించుకున్నారని ఆయన కొనియాడారు .అంతే కాకుండా స్వాతంత్ర సమర యోధునిగా భారతావని దాస్య శృంఖలాలను తొలగించి స్వేచ్ఛగా ప్రతి భారతీయుడు జీవించే విధంగా స్వాతంత్ర్య ఫలాలను అందించడంలో ఉమ్మడి మద్రాసు రాష్ట్రం తరుపున పనిచేసిన గొప్ప స్వాతంత్ర్య సమర యోధులు, న్యాయవాది ప్రకాశం పంతులు అని ప్రొఫెసర్ మూర్తి పేర్కొన్నారు. ఆంధ్ర కేసరి యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు మాట్లాడుతూ ఎటువంటి స్వార్థం లేకుండా తన జీవితాన్ని ఫణంగా పెట్టి ప్రజా సంక్షేమం,ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కోసం శక్తి సామర్థ్యాలను వినియోగించి కృషి చేసిన మహనీయులు టంగుటూరి ప్రకాశం పంతులు అని కొనియాడారు.ఆయన జీవితం నేటి సమాజానికి, యువతరానికి ఆదర్శం గా నిలుస్తోందని హరిబాబు పేర్కొన్నారు.ప్రకాశం పంతులు స్మృతికి చిహ్నంగా ఆయన జన్మ స్థలమైన ఒంగోలు ప్రాంతానికి ప్రకాశం జిల్లా అని, ఒంగోలులో నూతనంగా ఏర్పడిన విశ్వ విద్యాలయానికి ఆంధ్ర కేసరి యూనివర్శిటీ అని నామకరణం చేయడం జరిగిందని పలువురు వక్తలు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర కేసరి యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజ మోహన్ రావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్ నిర్మలా మణి, సిడిసి డీన్ ప్రొఫెసర్ జి సోమ శేఖర లతో బాటు బోధన, బోధనేతర సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బంగారం చోరీ కేసులో ముద్దాయి అరెస్ట్



- కేసు వివరాలు వెల్లడించిన సిఐ సుబ్బారావు



అగ్ని న్యూస్, మార్కాపురం (మే 20): బంగారం చోరీ కేసులో ముద్దాయి పట్టణానికి చెందిన దూదేకుల హుస్సేన్ బీ ని అరెస్ట్ చేశామని మార్కాపురం సిఐ సుబ్బారావు తెలిపారు.మంగళవారం ఆయన తన కార్యాలయంలో పట్టణ ఎస్ఐ లు సైదు బాబు, డాక్టర్ రాజమోహన్ లతో కలిసి మీడియాతో మాట్లాడారు. కొమరోలు మండలం బొంతపల్లి గ్రామానికి చెందిన మజ్జరి బాల వెంకటయ్య, మార్కాపురం లో జరిగే వివాహానికి హాజరయ్యేందుకు కుటుంబ సభ్యుల తో కలిసి ఈనెల 18 వ తేదీ సాయంత్రం కొమరోలు లో శ్రీశైలంవెళ్లే ఆర్టీసీ బస్ ఎక్కారు.మార్కాపురం లో బస్ దిగే సమయం లో బ్యాగ్ కనిపించక పోవడం తో పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని ప్రయాణీకులు, కంభం బస్టాండ్ సెంటర్లో బ్యాగ్ తీసుకుని వెళ్ళినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు సిఐ తెలిపారు.

కేసులను ఛేధించిన తీరు...

ఫిర్యాది ఇచ్చిన రిపోర్ట్ మేరకు, వెంటనే మార్కాపురం ఇన్స్పెక్టర్ సుబ్బారావు, మార్కాపురం పట్టణ ఎస్ఐ లు యం. సైదు బాబు,  యం. రాజ మోహన్ రావు, సిబ్బంది కలసి, సిసి కెమెరాలు పరిశీలించి, వాటి ద్వారా బంగారం ఉన్న బ్యాగ్ ను బస్సు నుండి దొంగిలించినది ఒక మహిళ అని గుర్తించి, ఆమెది మార్కాపురం పట్టణం లోని జగదీశ్వరి థియేటర్ దగ్గర నివాసం అని గుర్తించారు. మంగళవారం ఆమె ఇంటికి వెళ్లి, ఆమె దొంగిలించిన మొత్తం సొత్తు ను మధ్యవర్తుల సమక్షం లో స్వాధీనపరచుకొని ఆమె ను అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుంచి రెండు బంగారు చెయిన్లు, బ్రాస్లెట్, మూడు జతల చెవి రింగులు, తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రివార్డులు..

కేసును ఛేధించటంలో ప్రతిభ చూపిన మార్కాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.సుబ్బారావు, మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ లు ఎం. సైదు బాబు, డాక్టర్, ఎం. రాజ మోహన్ రావు,ఎఎస్ఐ రత్నం, కానిస్టేబుళ్ళు పిసి-2172, షేక్ షరీఫ్, పిసి-2601, డి. కోటి నాయక్ లను జిల్లా ఎస్పీ దామోదర్ అభినందించి, రివార్డ్ లు అందజేశారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో : అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy

# వేసవి విజ్ఞాన తరగతులు సద్వినియోగం చేసుకోవాలి





అగ్ని న్యూస్, మార్కాపురం (మే 20):పట్టణం లోని శాఖ గ్రంథాలయం లో వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభించారు ఈ కార్యక్రమంలో విద్యార్థులచే కథలు చెప్పించుట,పుస్తకములు చదివించుట మరియు చదరంగం నేర్పించుట జరిగిన ది అని గ్రంథ పాలకులు శివారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉప సంచాలకులు డా!అన్నపురెడ్డి వీరారెడ్డి ఉపాధ్యాయలు యం.వి.సుబ్బారావు పాల్గొన్నారు.ఈ వేసవి సెలవుల్లో ప్రతిరోజు గ్రంథాలయంను ఉపయోగించు కోవాలని గ్రంథ పాలకులు జి.వి.శివారెడ్డి కోరారు.తెలియచేయుట జరిగినది.







ఎప్పుడు నిత్య నూతనంగా
ప్రతి క్షణం ప్రగతిశీలంగా
ఇది ....
'అన్న' వారి విద్యాలయం .....
ఆధునిక దేవాలయం
THE EDGE IN KNOWLEDGE
KITS
A.V.RAMBABU
Chairman , M.L.A. Giddalur
A.KRISHNA CHAITANYA
Sec & Correspondent
KRISHNA CHAITANYA INSTITUTE OF TECHNOLOGY & SCIENCES
Affiliated to JNTUK, KAKINADA | Approved by AICTE, NEW DELHI
B.TECH
CSE - 180
ECE - 90
AI&ML - 60
Artificial Intelligence & Machine Learning
CSE-AI - 60
Artificial Intelligence
Civil - 30
M.TECH
VLSI & EMBEDDED SYSTEMS - 18
MBA - 60
100% PLACEMENTS
EAPCET/ECET CODE KCIT
MBA/ICET CODE KCIM
Only Institution with NAAC ACCREDITATION in Western Prakasam
మార్కాపురం, ప్రకాశంజిల్లా - 523 316
Contact : 9153409999, 9153019999
KITS
KRISHNA CHAITANYA
KITS


08596 - 223005
8790373006
బాలాజి ఇన్ లాడ్జి
A.C. Dining Hall
మార్కాపురం, ప్రకాశంజిల్లా
BALAJI INN LODGE
శశాంక్ ENT హాస్పిటల్
BALAJI INN
A.C DINING HALL

RK అగ్నిన్యూస్ The Power Of Truth
21 బుధవారం , మే 2025




Printed, Published & Owned by K.V.RAMANA RAO, APTEL 0548/01/1997 SV Printers - Markapur.(K.Rama Krishna- 9441533080/ 8309890844)